

149.5 కిలోల గంజాయి స్వాధీనం

చింతపల్లి, ఏప్రిల్ 3: మైదాన ప్రాంతానికి ఎగుమతి చేసేందుకు భద్ర పర్చిన 149.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశామని సీఐ కె.రమేశ్ తెలిపారు. చింతపల్లి మండలం కిటుముల పంచాయతీ చీమలపాడు గ్రామానికి చెందిన వ్యక్తి ఒడిశాలో గంజాయి కొనుగోలుచేసి గుర్రాలపై తీసుకొచ్చాడు. గ్రామ శివారు పొదల్లో భద్రపరిచినట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో ఎస్ఐ అరుణ్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

సర్కారు పాపం.. పెన్షనర్లకు శాపం

పింఛన్ల పంపిణీపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- బ్యాంకు ఖాతాల్లో పూర్తిగా జమకాని సొమ్ము
- అక్కరకు రాని సచివాలయ వ్యవస్థ
- జిల్లాలో తొలి రోజు ఐదు శాతమే పింఛన్లు పంపిణీ



పాడేరు- 1 సచివాలయంలో పింఛన్లు అందిస్తున్న సిబ్బంది

(పాడేరు, ఆంధ్రజ్యోతి)

సామాజిక పింఛన్ల పంపిణీ వ్యవహారంలో అందరూ ఊహించినట్టే జరిగింది. పింఛన్ల పంపిణీని గందరగోళం చేసి, ఆ నెపాన్ని తెలుగుదేశం పార్టీపై నెట్టాలనే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వం చేయాల్సిన తప్పులన్నీ చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీ నాటికే ఎంపీడీవోల బ్యాంకు ఖాతాల్లోకి జమయ్యే పింఛన్ సొమ్ము ఈనెల మూడో తేదీకి కూడా సంపూర్ణంగా జమకాలేదు. పింఛన్ల బట్వాడాకు ఎన్నికల సంఘం వలంటీర్లను దూరం పెట్టడంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇలా తమ అక్కసు తీర్చుకుందనే వాదన వినిపిస్తోంది. అంతేకాకుండా కొత్తగా ప్రవేశపెట్టి వ్యవహారంలా అధికార యంత్రాంగం చేసిన హడావుడి జనంలో నవ్వులపాలు చేసింది. ఇంత ఆర్భాటం చేసినా కనీసం పది శాతం కూడా పంపిణీ చేయలేకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలిచింది.

జిల్లాలోని 22 మండలాల్లోని 352 గ్రామ సచివాలయాలుండగా వాటి పరిధిలో 1,27,894 మంది సామాజిక పింఛన్ల లబ్ధిదారులున్నారు. వారికి ప్రతినెల రూ.38,79,85,000 అందించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుంచి బుధవారం నిధులు విడుదల కాకపోవడంతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగలేదు. కాగా ఈ విషయంలో విఫలమైతే ప్రభుత్వానికే చెడ్డ పేరు వస్తుందనే భావనకు బదులుగా, సమస్యలు అధికమైతే తెలుగుదేశం పార్టీపై నెట్టేసి, విస్తృత ప్రచారం చేసుకునేందుకు వైసీపీ అధికారులు కూడా సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పథకం ప్రకారం గందరగోళం

ముందస్తు పథకం ప్రకారమే అధికార యంత్రాంగం పింఛన్ల పంపిణీని గందరగోళం చేసిందని లబ్ధిదారులు, బాధితులు విమర్శిస్తున్నారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు సైతం దీనిపై ప్రత్యేక పర్యవేక్షణ, శ్రద్ధ పెట్టిన దాఖలాలు కన్పించలేదు. కేవలం రాజకీయ లబ్ధికే ప్రాధాన్యతనిచ్చిన వైసీపీ తమ ఎత్తుగడలను అమలుచేస్తూ లబ్ధిదారులను అవస్థలకు గురిచేయడం విమర్శలకు తావిచ్చింది. వాస్తవానికి ప్రతి నెలా పింఛన్ల పంపిణీలో ఎటువంటి సమస్యలు, లోపాలు ఉత్పన్నం కాలేదు. కేవలం ఈ ప్రక్రియ నుంచి వలంటీర్లను తప్పించారనే కక్షతోనే పింఛన్లు అందకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఎన్నికల్లో లబ్ధి పొందడం, టీడీపీని ప్రజల్లో చులకన చేసే ఎత్తుగడగా భావిస్తున్నారు. దీనికి అధికారులు కూడా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తొలి రోజు ఐదు శాతమే...

జిల్లాలో తొలి రోజు బుధవారం కేవలం ఐదు శాతం మందికి మాత్రమే పింఛన్లను పంపిణీ చేశారు. మండల స్థాయి అధికారుల ఖాతాల్లోకి ప్రభుత్వం సొమ్ము జమ చేయకపోడం, పలు చోట్ల విత్‌డ్రా కాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో కొన్ని సచివాలయాల పరిధిలో అరకొరగా, మరిన్ని చోట్ల అసలు ప్రారంభించని పరిస్థితి నెలకొంది.

స్వతంత్ర అభ్యర్థిగా వంతల సుబ్బారావు?

పాడేరులో పోటీకి అనుయాయుల ఒత్తిడి

కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించి మోసం చేశారని ఆగ్రహం



వంతల సుబ్బారావు

చింతపల్లి, ఏప్రిల్ 3: పాడేరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు స్వతంత్ర్య అభ్యర్థిగా రంగంలోకి దిగనున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు బుధవారం చింతపల్లిలో సమావేశమైన పార్టీ ముఖ్య నాయకులు సుబ్బారావుపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం క్రియాశీలకంగా పనిచేసి వంతల సుబ్బారావు జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు పదవులు చేపట్టారు. వైఎస్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం పార్టీ జిల్లా అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించింది. అంతేకాకుండా ఈ ఏడాది ఫిబ్రవరి 10న చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సమావేశానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డితోపాటూ పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరా రెడ్డి హాజరయ్యారు. బహిరంగ సమావేశంలో సుబ్బారావుని పాడేరు నియోజకవర్గం అభ్యర్థిగా షర్మిల ప్రకటించారు. దీంతో ఆయన ప్రచారం కూడా ప్రారంభించారు. అయితే ఊహించని విధంగా ట్రైకార్ మాజీ చైర్మన్ సతక బుల్లిబాబుకు టికెట్ కేటాయిస్తున్నట్టు మంగళవారం ప్రకటించడంతో సుబ్బారావుతోపాటూ అతని వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ముఖ్య నేతలంతా బుధవారం చింతపల్లిలో సమావేశమై భవిష్యత్తు రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. మెజారిటీ నేతలు సుబ్బారావుకే టికెట్ కేటాయించాలని అధిష్ఠానంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. అయినప్పటికీ ఫలించకుంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయాలని పట్టుబట్టారని, దీనికి సుబ్బారావు సానుకూలంగా స్పందించారని సమాచారం.



చింతపల్లిలో సుబ్బారావుతో సమావేశమైన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు



కార్యక్రమానికి హాజరైన మహిళలు, విద్యార్థులు

వెల్లివిరిసిన చైతన్యం

సందడిగా జిల్లా స్థాయి ఓటరు అవగాహన కార్యక్రమం

- ఓటుతోనే ప్రజాస్వామ్యానికి పటిష్ఠ పునాది
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత

పాడేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): **ఓటు హక్కు వినియోగంపై గిరిజనంలో చైతన్యం వెల్లివిరిసింది. పాడేరులో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓటరు అవగాహన కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని. పటిష్ఠమైన ప్రజాస్వామ్యానికి పునాది వేయాలని కోరారు.**



కోలాటం ఆడుతున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్లు

స్థానిక గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో నిర్వహించిన 'క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యంపై అవగాహన' (స్వీప్) కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు పటిష్ఠ పజాస్వామ్య సౌధం నిర్మించేందుకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈనెల 14 తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, అర్హులంతా విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 7.7 లక్షల మంది ఓటర్లున్నారని, ఎటపాక, కూనవరం మండలాల నుంచి అనంతగిరి మండలం వరకు జిల్లాలో స్వీప్ కార్యక్రమం నిర్వహించి మారు మూల ప్రాంత ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా విజ్ఞతతో ఓటు వేయాలని పేర్కొన్నారు. పాడేరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ మాట్లాడుతూ ఎన్నికల పర్వంలో అందరూ పాల్గొని దేశానికి గర్వకారణంగా నిలవాలన్నారు. అరకులోయ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 90 శాతం ఓటింగ్ లక్ష్యంగా పెట్టుకున్నామని, పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించామన్నారు. గత ఎన్నికల్లో 70 శాతం ఓటింగ్ జరిగిందన్నారు. ఏఎస్పీ కె.ధీరజ్ మాట్లాడుతూ ఓట ర్లు నిర్భయంగా ఓటు వేయాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా ఓటింగ్‌ను అడ్డుకుంటే కఠిన చర్యలు చేపడతామన్నారు.

కదిలి వచ్చిన గిరిజనం

కార్యక్రమానికి ముందు జి.మాడుగుల, కె.కోడాపల్లి గ్రామా లకు చెందిన స్వయం సహాయ సంఘాల సభ్యులు కోలాటం తో అతిథులకు స్వాగతం పలికారు. ఓటు హక్కు వినియో గంపై మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు, థింసా నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ విజయసునీత, జాయింట్ కలెక్టర్ భావన, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్లు, డీఆర్‌వో కోలాటం, థింసా నృత్య ప్రదర్శనల్లో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వీవీఎస్.శర్మ, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, అధికారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటికి.. కడివెడు కష్టం!

ఏజెన్సీలో ప్రారంభమైన తాగునీటి ఇక్కట్లు

- ఊటబావుల్లో బురదనీరు
- తప్పనిస్థితిలో తాగుతున్న గిరిజనులు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- రక్షిత నీటి పథకాలకు లభించని మోక్షం



విధిలేక రెండు కిలోమీటర్ల దూరం నుంచి కలుషిత నీటిని మోసుకువస్తున్న చీడిపల్లి మహిళలు

కొయ్యూరు, ఏప్రిల్ 3: **ఏజెన్సీ గ్రామాల్లో వేసవి నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి తాగునీటికి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఆ అవకాశమూ లేని గ్రామాల వారంతా ఊట బావుల్లో లభ్యమవుతున్న బురదనీటినే సేకరించాల్సి వస్తోంది. ఫలితంగా వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు.**

కొయ్యూరు మండలం బూదరాళ్ల శివారు చీడిపల్లి గ్రామస్థులు తీవ్ర తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో గ్రామానికి సురక్షిత తాగునీటిని అందిస్తామని నేతలు ఇచ్చిన హామీలు ఐదేళ్లు గడిచినా అమలుకు నోచుకోకపోవడంతో కలుషిత ఊట నీటితోనే గ్రామస్థులు దప్పిక తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



చీడిపల్లిలో కలుషిత ఊటనీటిని పట్టుకుంటున్న మహిళలు

ఈ గ్రామంలో 50 నివాసాలు ఉండగా సుమారు 250 జనాభా ఉంది. వీరికి నేటికీ రక్షిత తాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో గల కలుషిత ఊట నీటిని సేకరించి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి సమీపించడంతో ఊటనీరు కలుషితమయింది. ఇప్పటికే బురదతో ... మిగతా 8వ పేజీలో



చెలరేగిన కోల్‌కతా నైట్‌రైడర్స్

ఢిల్లీ క్యాపిటల్స్‌పై 106 పరుగుల తేడాతో విజయం

- శివమెత్తిన సునీల్ నరైన్
- తొలిమ్యాచ్‌లో అర్ధ సెంచరీతో రాణించిన రఘువన్షి
- స్టేడియంలో షారుక్ ఖాన్ సందడి



రిషబ్ పంత్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 3: కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు బ్యాట్స్‌మెన్ బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని సిక్సర్లు, బౌండరీలతో హోరెత్తించారు. దీంతో కోల్‌కతా నైట్ రైడర్స్ 106 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 272 పరుగులు భారీస్కోరు చేసింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, సునీల్ నరైన్ రెండో ఓవర్ నుంచే రెచ్చిపోయారు. దీంతో 4.1 ఓవర్లలోనే జట్టు స్కోరు 50 పరుగులకు చేరింది. ధాటిగా ఆడిన నరైన్ కేవలం 21 బంతుల్లో ఆరు బౌండరీలు, నాలుగు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. నరేన్‌కు ఫిల్ సాల్ట్ (18) స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రఘువన్షీ తోడవ్వడంతో స్కోరు బోర్డు మరింత వేగం పుంజుకుంది. అద్భుతమైన షాట్లతో అలరించిన రఘువన్షీ తన ఐపీఎల్ కెరీర్‌లో ... మిగతా 8వ పేజీలో



అభిమానులకు షారూఖ్ అభివాదం

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.14
సహరి (శుక్ర)	4.35

పాడేరు ఘాట్‌లో ఘోరం

అదుపు తప్పి లోయలోకి బోల్తా పడిన బొలేరో

ఇద్దరు మృతి: 30 మందికి గాయాలు

పాడేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): **పాడేరు ఘాట్ రోడ్డులో బుధవారం రాత్రి ఘోరం జరిగింది. ప్రయాణికులతో కిక్కిరిసిన బొలేరో అదుపుతప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒక మహిళ (35), పురుషుడు(40) మృతి చెందగా మరో 30 మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి...**

ఒడిశా రాష్ట్రం నుంచి కూలి పనుల కోసం 32 మంది బొలేరో వాహనంలో బుధవారం విజయవాడ బయలుదేరారు. పాడేరు మీదుగా మైదాన ప్రాంతానికి చేరే క్రమంలో రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో స్థానిక ఏసుప్రభు బొమ్మ మలుపునకు ముందున్న మలుపు వద్ద వాహనం అదుపు తప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఒక మహిళ, మరో పురుషుడు అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్‌తో సహా మరో 30 మందికి గాయాలయ్యాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వారు గమనించి బొలేరోలో చిక్కుకున్న వారికి లోయలోంచి బయటకు తీశారు. అంబులెన్సులకు సమాచారం ఇచ్చి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితులంతా కూలీలేనని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. రాత్రి సమయంలో సంఘటన జరగడంతో మృతులు, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.



క్షతగాత్రులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


చికిత్స పొందుతూ మృతిచెందిన రాజబాబు

కొయ్యూరు, ఏప్రిల్ 3: రింపుల ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొదుతూ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి చెందిన గుడివాడ రాజబాబు(28) మంగళవారం ఉదయం చోద్యం నుంచి గూడెం మండలం పెదవలస గ్రామానికి ట్రాక్టరులో ఇసుక తీసుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రింపుల ఘాట్ రోడ్డు చినకాట్రగెడ్డ గ్రామం వద్ద మలుపులో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజబాబు అపస్మారక స్థితికి చేరాడు. ప్రమాద ఘటనను గుర్తించిన ప్రయాణికులు అంబులెన్సులో కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు.

అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ రాజబాబు మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్టు కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కాగా, రాజబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని మృతితో కుటుంబీకులు భోరున విలపిస్తున్నారు.

రూ.3.56 లక్షల నగదు స్వాధీనం

రోలుగుంట, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇటీవల కాలంగా నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో రూ.3.56 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేశ్ బుధవారం తెలిపారు. వీటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అధిక మొత్తంలో నగదును తీసుకువెళ్లేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందిగా సూచించారు.

11 కిలోల గంజాయి స్వాధీనం

పెదబయలు, ఏప్రిల్ 3 : మండల కేంద్రం పెదబయలు సమీపం ఆంధ్ర- ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గల వంతెన వద్ద పదకొండు కిలోల గంజాయితో ఓ వ్యక్తి పట్టుబడినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్-3 ఆఫీసర్, ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావు తెలిపారు. బుధవారం పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇంతలో ఒడిశా నుంచి ఆంధ్రా వైపు వస్తున్న ఓ సర్వీసు ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు తమను చూసి ఆటోలో నుంచి పారిపోతున్నారన్నారు. అనుమానం వచ్చి సిబ్బంది వెంబడించగా, గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన షేక్ సుభానీ పట్టుబడ్డాడన్నారు. అనంతరం అతడి వద్ద గల బ్యాగును తనిఖీ చేయగా, పదకొండు కిలోల గంజాయి లభ్యమైనట్టు చెప్పారు. ఒకే ప్రాంతానికి చెందిన ఈ ఇద్దరూ ఒడిశాలో గంజాయిని కొని పాడేరు మీదగా విశాఖపట్నం చేరుకొని విక్రయిస్తుంటారన్నారు. నిందితుడ్ని పెదబయలు స్టేషన్‌కు అప్పగించినట్టు చెప్పారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

రోలుగుంట, ఏప్రిల్ 3: మండలంలోని ఎంకేపట్నం శివారులో బుధవారం నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సురేశ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టగా, ఎంకేపట్నానికి చెందిన రొంగలి సత్తిబాబు వద్ద ఈ గంజాయి పట్టుబడడంతో అరెస్టు చేసినట్టు చెప్పారు.

శ్రీరాంపురంలో 19మంది వలంటీర్లు రాజీనామా

▸▸ వైసీపీ నాయకుడు సమక్షంలో వెల్లడి

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 3 : మండలంలోని శ్రీరాంపురం పంచాయతీ పరిధిలో గల వలంటీర్లు బుధవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు సమక్షంలో రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ గ్రామంలో 19మంది వలంటీర్లు పనిచేస్తుండగా, తామంతా స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గెడ్డమూరి శ్రీనువాసరావు, టి.నరసింహరాజు, బోడపాటి గోవింద్ పులగల రాంబాబు, బావారపు అప్పారావు, పులగల భద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారాల్లో గానీ, పెన్షన్ల పంపిణీలో గానీ వలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో వలంటీర్లు రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

'ఎయిడ్స్, క్షయ నివారణకు ప్రత్యేక దృష్టి'

సబ్బవరం, ఏప్రిల్ 3 : మండలంలో ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి ఎంపీ ఎస్కే బాలాజీ సూచించారు. ఇక్కడి పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశ, డాక్టర్ విద్యాధరి, సీహెచ్‌వో వై .స్వర్ణలత, ఎంపీహెచ్ఈవో జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ ఉపమాకలో అవగాహన సదస్సులో సీఐ విజయ్‌కుమార్


ఉపమాక గ్రామస్థులతో సమావేశమైన సీఐ విజయ్ కుమార్

నక్కపల్లి, ఏప్రిల్ 3 : 'మీకు లాటరీ తగిలిందని, లేదా ఈ లింక్ ఓపెన్ చేస్తే బోనస్ వస్తుందని, మీకు జాబ్ కావాలంటే ఈ మెసేజ్‌కు సమాధానం ఇవ్వండి' అని వాట్సాప్‌లలో సైబర్ నేరగాళ్లు పంపే లింక్‌లను ఓపెన్ చేయవద్దని సీఐ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ఉపమాక గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. తప్పుడు మెసేజ్‌ల వల్ల మోసపోవద్దన్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఖాతాల్లో నగదు మాయం ఖాయమన్నారు. ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అంతా సహకరిచాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పోలీసులు సిబ్బందితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఐపీఎల్ హుషారు


బౌలింగ్ చేస్తున్న ఇషాంత్ శర్మ


వికెట్‌పడిన ఆనందంలో కోల్‌కతా ఆటగాళ్లు


ఫిలిప్ సాల్ట్ బ్యాటింగ్


స్టేడియంలో అభిమానుల సందడి


మ్యాచ్‌ను తిలకిస్తున్న షారూఖ్ ఖాన్

పారదర్శకంగా ఎన్నికల ఏర్పాట్లు

▸▸ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశమైన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓట్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులతో సహా ఎన్నికల ముందస్తు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే వారం ఎన్నికల సిబ్బంది మొదటి రాండమైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. వేయి ఓటర్లు లోపు ఉన్న పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, నలుగురు ఓపీఓలు, వేయికి మించితే పీవో, ఐదుగురు గురు ఓపీఓలు ఉంటారని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపున సంబంధించి ప్రతి కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించి ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు, పార్లమెంట్‌కు సంబంధించి ఏడు (పెందుర్తితో కలిపి) నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు అనకాపల్లిలోనే జరుగుతుందని వివరించారు. సి-విజిల్, ఆర్వోలకు ఇచ్చిన ఫిర్యాదులు, దినపత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తలకు సబంధించి ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నామన్నారు.

ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే జిల్లాలో పింఛన్ పంపిణీ జరగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు (టీడీపీ), ఐఆర్ గంగాధర్ (కాంగ్రెస్), రత్నుల శంకర్రావు (సీపీఎం), కె.హరనాథబాబు (ఆమ్‌ఆద్మీ), పి.నాగేశ్వరరావు (బీజేపీ), కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి పి.ప్రసాద్, ఆడిటర్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికలకు సబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి డీడీపీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

టోల్ ఫ్రీ నెంబర్ 1950, ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్ 08924-226599 లకు ఫోన్ చేసి ఎన్నికలకు సబంధించిన గ్రీవెన్స్‌ను తెలియజేయాలని సూచించారు.

24 గంటలూ అందుబాటులో ఉంటామని వివరించారు.

మత్స్యకారులు సురక్షితం

▸▸ అప్పికొండ తీరానికి చేరిక


అప్పికొండలోని ఓ ఇంట్లో భోజనం చేస్తున్న మత్స్యకారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 3: సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన ఆరుగురు మత్స్యకారులు క్షేమంగా ఉన్నారు. బుధవారం ఉదయం అప్పికొండ తీరానికి చేరుకున్నారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం...విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి సోమవారం సాయంత్రం ఐఎన్‌డి-ఏపీ-2736 నంబరు గల బోటులో కర్రి చిన్నారావు, కర్రి నరేంద్ర, కర్రి సత్తెయ్య వాసుపల్లి అప్పన్న, పొడుగు అప్పన్న, మైలపల్లి మహేష్‌లు వేటకు వెళ్లారు. అలల ఉధృతికి మంగళవారం సముద్రంలో బోటు బోల్తాపడింది. దీంతో ఆరుగురు బిక్కుబిక్కుమంటూ రాత్రంతా బోటు పై భాగంలో ఉండిపోయారు. ఆదేబోటును ఆసరాగా చేసుకుని బుధవారం తెల్లవారు జామున అప్పికొండ తీరానికి చేరుకున్నారు. దగ్గరలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు అప్పికొండ వెళ్లారు. మత్స్యకారులను మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌కు అప్పగించారు.

విశాఖలో వైసీపీ తాయిలాలు

▸▸ ఓటర్లకు రైస్ కుక్కర్లు ▸▸ ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడులు

▸▸ కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కార్యకర్తల దాడి


తారామసీదు ఏరియాలో ఫ్లైయింగ్ స్క్వాడ్ పట్టుకున్న రైస్‌కుక్కర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 3: విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 22 వ వార్డు తారామసీదు ఏరియాలో బుధవారం రాత్రి వైసీపీ నాయకులు రైస్‌కుక్కర్లు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆటోల్లో గంగ బ్రాండ్ రైస్‌కుక్కర్లను (5.5 లీటర్స్) తీసుకొచ్చి రోడ్డుపై దింపారు. ఈ సమాచారం ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అందడంతో అక్కడకు చేరుకుని రైస్‌కుక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీస్తున్న మీడియా ప్రతినిధులను వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. 'ఈనాడు', 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రతినిధులపై దాడి చేసి కెమెరాలు లాక్కున్నారు. దీంతో దాడులు చేసిన వారిని పోలీసులు చెదరగొట్టారు. ఈ గందరగోళంలో స్థానికులు కొంతమంది రైస్‌కుక్కర్లను ఎవరికి దొరికింది వారు పట్టుకునివెళ్లిపోయారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే కన్నబాబు ప్రజల ఆస్తులు దోచుకున్నారు

▸▸ అందుకే ఓట్లు అడిగేందుకు భయం

▸▸ మధ్యవర్తి ద్వారా నాతో సంప్రదింపులు

▸▸ కార్యకర్తల సమావేశంలో ఎంపీ ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేశ్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేశ్

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 3: ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు నియోజకవర్గ ప్రజల ఆస్తులను దోచుకున్నారని బీజేపీ నాయకుడు, అనకాపల్లి ఎంపీ ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేశ్ ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి బుధవారం ఆయన అచ్యుతాపురంలో పర్యటించారు. తొలుత చోడపల్లి నుంచి భారీగా ర్యాలీగా కోనేపాలెంలో గల ఫంక్షన్ హాలుకు చేరుకుని మాట్లాడారు. ప్రజల ఆస్తులను దోచుకుంటూ, నమ్మక ద్రోహానికి తలపడిన ఎమ్మెల్యే కన్నబాబు నేడు ఓట్లను అడగడానికి భయపడుతున్నారన్నారు. కన్నబాబు స్నేహితుడు ఒకరు తనను కలిసి ఎలమంచిలి ఎన్నికలలో జోక్యం చేసుకోకపోతే ఎంపీ ఓట్ల విషయంలో సహకరిస్తానని మంతనాలు జరపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను జనసేన అభ్యర్థిగా ఇక్కడ బరిలో సుందరపు విజయ్‌కుమార్ గెలుపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. త్వరలో ప్రధాన మంత్రి మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ప్రచారాలకు రానున్నారన్నారు.

ఎన్నో అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌ను ఈ ఎన్నికల్లో ప్రజలంతా ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. ఎలమంచిలి ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ, జనసేనలది అన్నదమ్ముల అనుబంధం లాంటిదన్నారు. ఎలాగైనా వాటిని విడగొట్టడానికి వైసీపీనాయకులు చేస్తున్న ప్రయత్నాలు సఫలం కాదన్నారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి జిల్లా అభివృద్ధికి దోహదపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరంమాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు డ్రీమ్స్ నాయుడు, మేరుగు బాపు నాయుడు, మామిడి శివ అప్పారావు, పి.నాగేశ్వరరావు, జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రామదాసు, ఆడారి మంజు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన పీఏసీఎస్ ఉద్యోగి సస్పెండ్

రోలుగుంట, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన రోలుగుంట పీఏసీఎస్ కార్యాలయ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మద్దు తాతబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. కొండపాలెం గ్రామానికి చెందిన పిల్లా నూకరాజు రోలుగుంట పీఏసీఎస్ కార్యాలయంలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కాగా, గత నెల 31న రోలుగుంట సాయిబాబా గుడి సమీపంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి శ్యామల, నియోజకవర్గ ఆర్‌వో చిన్నికృష్ణకు ఫిర్యాదులు అందాయి. దీంతో క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు విచారణ చేపట్టి అనంతరం అందిన నివేదిక ఆధారంగా జిల్లా సహకార శాఖ అధికారిణి (డీసీవో) ప్రేమ స్వరూపారాణి ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి బాధ్యతలను స్టాఫ్ అసిస్టెంట్ మద్దు గణేశ్‌కు అప్పగించారు.

ఇద్దరి అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు


బీఎస్‌వీ కృష్ణ (ఫైల్ ఫొటో)


కె.రాణి (ఫైల్ ఫొటో)

అక్కిరెడ్డిపాలెం (విశాఖపట్నం), ఏప్రిల్ 3: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నగరంలోని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో మంగళవారం వీరిద్దరి అవయవాలను సేకరించారు. ఇందుకు సంబంధించి బుధవారం జీవన్‌దాన్ వైద్య అధికారులు, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాలివి...విశాఖలోని సీతమ్మపేటకు చెందిన బీఎస్‌వీ కృష్ణ (50) ఒక జ్యూవెలరీ దుకాణంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 29వ తేదీన విధుల్లో భాగంగా రాజమండ్రి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ఎలమంచిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించారు. అయితే, కృష్ణ బ్రెయిన్‌డెడ్ కావడంతో మంగళవారం ఆయన కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఊపిరితిత్తులను సేకరించిన జీవన్‌దాన్ వైద్య సిబ్బంది వాటిని హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి గ్రీన్‌ఛానల్ ద్వారా తరలించారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన కొవ్వూరి రాణి (50) గత నెల 29వ తేదీన స్కూటీ పై నుంచి పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. చికిత్స కోసం రాజమండ్రిలోని ఆసుపత్రిలో చేర్పగా... అక్కడ నుంచి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో తీసుకువచ్చారు. రాణికి బ్రెయిన్‌డెడ్ అయినట్టు గుర్తించిన వైద్యులు ఆ విషయం కుటుంబసభ్యులకు తెలపగా...అవయవ దానానికి అంగీకారం తెలిపారు. దీంతో రాణి కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులను సేకరించారు. కృష్ణ, రాణి అవయవాలను జీవన్‌దాన్‌లో నమోదు చేసుకున్న నలుగురికి అమర్చినట్టు వైద్యులు తెలిపారు.

నగదు రాలేదు.. పింఛన్ అందలేదు!

ప్రతి నెలా ఒకటో తేదీన అందించే సామాజిక పింఛన్లు ఈ నెల 3వ తేదీ ముగిసినా మండలంలో అధిక శాతం లబ్ధిదారులకు అందలేదు. దీనికి ప్రతిపక్షాలే కారణమని వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తుండగా, ఇదంతా కావాలనే చేస్తూ తమపైకి నెట్టి లబ్ధి పొందాలని అధికార పార్టీ నేతలు రాజకీయం చేస్తున్నారని విపక్షాలు ఖండిస్తున్నాయి. తాజాగా 3వ తేదీకి కూడా ప్రభుత్వం నగదు మంజూరు చేయకపోవడంతో ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి.

- చింతపల్లి సచివాలయం-1లో మాత్రమే పంపిణీ
- మిగిలిన 21 గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారుల అగచాట్లు
- జాప్యానికి ప్రతిపక్షాలే కారణమని వైసీపీ ఆరోపణ
- రాజకీయ లబ్ధికి వైసీపీ కావాలనే చేస్తున్నదని విపక్షాల ధ్వజం


మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లకు మ్యాపింగ్ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు


గ్రామ సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

చింతపల్లి, ఏప్రిల్ 3: మండలంలోని ఒక సచివాయలం మినహా మరెక్కడా పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. చింతపల్లి-1 సచివాలయంలో మాత్రమే బుధవారం పింఛన్ల పంపిణీ జరిగింది. దీంతో పింఛన్‌దారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 22 గ్రామ సచివాలయాల పరిధిలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారులు 9,604 మంది ఉన్నారు. లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసేందుకు రూ.2.95 కోట్ల నగదు అవసరం. ప్రభుత్వం 3వ తేదీ నుంచి పింఛన్ పంపిణీ చేస్తామని ముందుగా ప్రకటించడం, ఎన్నికల కమిషన్ గ్రామ వలంటీర్లను పింఛన్ల పంపిణీ బాధ్యతలను తొలగించడం వల్ల ఉదయం నుంచే గ్రామ సచివాలయాల వద్ద లబ్ధిదారులు క్యూ కట్టారు. అయితే మండలంలో ఇప్పటికి ఎనిమిది గ్రామ సచివాలయాలకు సంబంధించి రూ.92.78 లక్షల నగదు మాత్రమే మంజూరైంది. సాయంత్రం నాటికి బ్యాంకు ఖాతాలో నగదు జమకాబడిన చింతపల్లి-1, తాజంగి, ఎ.శనివారం గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల నగదు తీసుకున్నారు. ఇతర సచివాలయాలకు ఇప్పటి వరకు నగదు అందలేదు. చింతపల్లి-1 సచివాలయం పరిధిలో పింఛన్ల పంపిణీని వెల్ఫేర్ అసిస్టెంట్ సాయంత్రం ప్రారంభించగా, తాజంగి, ఎ.శనివారం గ్రామ సచివాలయాలకు నగదు తీసుకువెళ్లే సరికి చీకటి పడిపోవడంతో మరుసటి రోజు ఉదయం పంపిణీ చేస్తామని వెల్ఫేర్ అసిస్టెంట్లు తెలిపారు. అయితే అన్ని గ్రామ సచివాలయాల్లోనూ పింఛన్ పంపిణీ గురువారం ఉదయం నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వీర సాయి బాబు తెలిపారు. కాగా, పింఛన్ల పంపిణీ వ్యవహారాన్ని అధికార, విపక్షాలు ప్రచార అస్త్రంగా మార్చుకున్న విషయం తెలిసిందే. పింఛన్ల పంపిణీ జాప్యానికి విపక్షాలే కారణమని సాక్షాత్తు సీఎం జగన్‌తో పాటు వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆరోపిస్తుండగా, ఇలా చేసి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నిస్తున్నదని విపక్ష నేతలు తేల్చి చెబుతున్నారు. ఏదేమైనా పేదలకు అందించే పింఛన్లు జాప్యం చేయడంతో పాటు మండుటెండల్లో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి రమేశ్‌నాయుడు, పక్కన జనసేన, బీజేపీ నేతలు

కూటమి అభ్యర్థుల విజయమే ధ్యేయం

- టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల స్పష్టీకరణ

పాడేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ భాగస్వామ్యంతో అరకులోయ పార్లమెంట్, పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తామంతా పనిచేస్తామని తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నేతలు స్పష్టం చేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా పాడేరు టీడీపీ అభ్యర్థి కేవీ రమేశ్‌నాయుడు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలతో విసిగిన జనం కూటమి ప్రభుత్వం ఏర్పడాలని కోరుకుంటున్నారన్నారు. గిరిజనుల్ని వైసీపీ ఘోరంగా మోసం చేసిందని, సమస్యలపై నిలదీస్తే ప్రాణాలు తీస్తున్నారని, రంపచోడవరం ప్రాంతంలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య, డోర్‌డెలివరీ ఘటనే దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. జనసేన పాడేరు ఇన్‌చార్జి డాక్టర్ వి.గంగులయ్య మాట్లాడుతూ వైసీపీ కబంధహస్తాల నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలనే లక్ష్యంతోనే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయన్నారు. వైసీపీ పాలనలో గిరిజనులకు అన్నివిధాలా తీవ్ర అన్యాయం జరిగిందని, కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ నేతలు నందోలి ఉమామహేశ్వరరావు, రాజు, జనసేన నేతలు బిదివ్యలత, అశోక్, భూపాల్, సుమన్, టీడీపీ నేతలు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి రమేశ్‌కు ఘన సత్కారం


రమేశ్‌ను సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు, యువకులు

పాడేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంపాడ గ్రామంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి కేవీ.రమేశ్‌నాయుడుకు టీడీపీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. తుంపాడలో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆయనకు స్థానిక నాయకులు, ప్రజలు శాలువాలు కప్పి సన్మానం చేశారు. రమేశ్‌నాయుడు గెలుపునకు సమష్టిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారంతా ముక్తకంఠంతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శోభా శ్రీను, సోమెలి చిట్టిబాబు, ఉల్లి రామారావు, బొంజునాయుడు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తేనే విజయం సాధ్యం

- వైసీపీ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకురాలు హైమావతి


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నేత హైమావతి

అరకులోయ, ఏప్రిల్ 3: అందరూ సమష్టిగా పనిచేస్తేనే విజయం సాధ్యమని అరకు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ పరిశీలకురాలు శోభ హైమావతి దేవి అన్నారు. పద్మాపురం సమీపంలోని ఓ రిసార్ట్‌లో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎవరికి వారు నాయకులతో సమన్వయం లేకుండా ప్రచారం చేసుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. చిన్నచిన్న లోపాలు ఉంటే సరిచేసుకుంటూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆమె కోరారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ రవిబాబు మాట్లాడుతూ పార్టీ గ్రామ స్థాయి నుంచి నియమించిన క్యాడర్ అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ ఎన్నికలను ఎదుర్కోవడానికి అంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అరకు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి మత్సలింగం, పార్టీ మండల అధ్యక్షుడు లక్కోయి లక్ష్మణకుమార్, జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోష్నీ, ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న పాల్గొన్నారు.

మన్యంలో వర్షం.. చల్లబడిన వాతావరణం


అరకులో హోరున కురుస్తున్న వాన

అరకులోయ/డుంబ్రిగుడ, ఏప్రిల్ 3: గత కొద్దిరోజులుగా భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న మన్యం వాసులకు బుధవారం కురిసిన వర్షం సాంత్వన చేకూర్చింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు అరకులోయ, డుంబ్రిగుడ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మైదాన ప్రాంతం కంటే విపరీతమైన ఎండలు కాసిన నేపథ్యంలో కురిసిన వర్షం ఊరటనిచ్చిందని ఆయా ప్రాంతాల వాసులు చెబుతున్నారు.

తాగునీటికి ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

చింతపల్లి, ఏప్రిల్ 3: నెల రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని సాయినగర్ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సాయినగర్‌లో బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ నెల రోజులుగా సాయినగర్ వీధికి నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లోనూ సీపీడబ్ల్యూ పథకం ద్వారా నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. బావులు అడుగంటిపోయాయని, కొళాయిల ద్వారా నీటి సరఫరా చేయడం లేదని వాపోయారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు తాగునీరు సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాల్సివున్నప్పటికీ, కనీసం పట్టించుకోవడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వంట చేసుకునేందుకు అవసరమైన ఒకటీ, రెండు బిందెల నీటిని సైతం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద పైపు వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. ఓట్ల కోసం ఇంటికొచ్చే ప్రజాప్రతినిధులు సైతం నీటి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవడం లేదని వాపోయారు.

ఉదజని సూచి పరీక్షలతో ఎంతో మేలు

- కాఫీ తోటల్లో అధిక దిగుబడులకు ఉపయుక్తం
- కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ రమేశ్


ఉదజని సూచి పరీక్షల ఫలితాలను రైతులకు అందిస్తున్న అధికారులు

చింతపల్లి, ఏప్రిల్ 3: ఆదివాసీ రైతులు కాఫీ తోటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు ఉదజని సూచి (భూసారం) పరీక్షలు చేయించుకోవాలని కాఫీ బోర్డు పాడేరు డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రమేశ్ సూచించారు. మండలంలోని ఎ.శనివారం పంచాయతీలో కాఫీ బోర్డు అధికారులు ఉదజని సూచి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలోని సూక్ష్మ పోషకాలు కాఫీ మొక్కలకు అందాలంటే ఉదజని సూచి 6.0 నుంచి 6.5 మధ్యలో ఉండాలని స్పష్టం చేశారు. ఇది తక్కువగా పోషకాలు అందక దిగుబడులు తగ్గిపోతాయన్నారు. గిరిజన ప్రాంతంలో కాఫీ దిగుబడులకు అనువైన ఉదజని సూచి కలిగిన భూములు తక్కువగా ఉన్నాయన్నారు. పాడేరు రెవెన్యూ డివిజన్‌లో ఇప్పటి వరకు తొమ్మిది శిబిరాలు నిర్వహించి 600 ఉదజని సూచి పరీక్షలు చేశామన్నారు. కాఫీ తోటలు కలిగిన భూముల్లో మట్టిని సేకరించుకుని రైతులు కాఫీ బోర్డు నిర్వహించే శిబిరానికి తీసుకొస్తే వెంటనే పరీక్ష చేసి ఉదజని సూచి తెలియజేస్తామని ఆయన వివరించారు. శిబిరాలకు హాజరుకాలేని రైతులు అరకు, మినుములూరు (పాడేరు), చింతపల్లి కాఫీ బోర్డు కార్యాలయానికి మట్టి నమూనాలను అందజేస్తే వెంటనే పరీక్షలు చేసి ఫలితాలు ఇస్తామన్నారు. కాఫీ తోట కలిగిన భూమిలో ఉదజని సూచి 6 కంటే తక్కువగా ఉంటే డోలామైట్, అగ్రికల్చర్ లైమ్(సున్నం) కాఫీ బోర్డు అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులో వేసుకోవాలన్నారు. దీనివల్ల కాఫీ మొక్కలకు భూమిలోని పోషకాలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జేఎల్‌వో ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

బుంగాపుట్టులో పోలింగ్ బూత్ ఏర్పాటుచేయాలి


పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని కోరుతున్న సర్పంచ్, గిరిజనులు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 3: బుంగాపుట్టు పంచాయతీ కేంద్రంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. సర్పంచ్ నోయినతో పాటు ఆ ప్రాంతీయులు బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయకపోతే త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పంచాయతీ కేంద్రంలో పోలింగ్ బూత్ పెడతామని అధికారులు చెప్పి బాబుసాల పంచాయతీ మత్స్యపురంలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఈసారి కూడా సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాన్ని లక్ష్మీపురం, మత్స్యపురం గ్రామాలలో ఏర్పాటు చేశారని వారు తెలిపారు. పదుల కిలోమీటర్లు కాలినడకన ఆయా కేంద్రాలకు పిల్లాపాపలతో వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవడం కష్టసాధ్యంగా ఉంటుందని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ రఫిజాన్‌ను వివరణ కోరగా ప్రస్తుతం ఎన్నికల ఏర్పాట్లు జరుగుతున్నాయని, పరిస్థితుల ఆధారంగా బుంగాపుట్టు లేక లక్ష్మీపురంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

వైసీపీ నుంచి వెయ్యి మంది టీడీపీలో చేరిక

- విశాఖ డెయిరీ డైరెక్టర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పాల సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు...


టీడీపీలో చేరేందుకు భారీగా తరలివచ్చిన అధికార వైసీపీ నాయకులు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పాల సంఘాల అధ్యక్షులు

చోడవరం, ఏప్రిల్ 3: అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. నియోజకవర్గంలోని బుచ్చెయ్యపేట మండలానికి చెందిన వైసీపీ నాయకుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణతో పాటు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పాల సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు..సుమారు వెయ్యి మందికిపైగా నాయకులు, కార్యకర్తలు బుధవారం టీడీపీలో చేరారు. వీరంతా వందకుపైగా కార్లలో ర్యాలీగా చోడవరం టీడీపీ కార్యాలయానికి వచ్చారు. వారికి చోడవరం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, తదితరులు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

చెలరేగిన కోల్‌కతా నైట్‌రైడర్స్

... 5వ పేజీ తరువాయి

తొలి అర్ధ సెంచరీ (54; 3 సిక్సర్లు, 5 బౌండరీలు) సాధించాడు. మరోవైపు కేవలం 39 బంతుల్లో ఏడు బౌండరీలు, ఏడు సిక్సర్లతో 85 పరుగులు చేసిన సునీల్ నరైన్ (85) రెండో వికెట్‌గా అవుటయ్యాడు. ఆ తర్వాత స్థానాల్లో దిగిన ఆండ్రూ రస్సెల్ (41), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (18), రింకూ సింగ్ (26) సిక్సర్లు, బౌండరీలతో విరుచుపడడంతో జట్టు స్కోరు 272 పరుగులకు చేరింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 17.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిషబ్ పంత్ (55), స్టబ్స్ (54) అర్ధ సెంచరీలు సాధించగా, మిగిలిన బ్యాట్స్‌మెన్లు ఘోరంగా విఫలమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ ఆరోరా, వరుణ్ చక్రవర్తి తలో మూడు వికెట్లు పడగొట్టగా, మిచెల్ స్టార్క్ రెండు వికెట్లు తీశాడు.

షారుఖ్ ఖాన్ సందడి

స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించడానికి ఆయా జట్ల యజమానులు ప్రత్యేక విమానాల్లో నగరానికి చేరుకున్నారు. ముంబై నుంచి ప్రత్యేక విమానంలో బుధవారం సాయంత్రం ఇక్కడకు విచ్చేసిన బాలీవుడ్ నటుడు, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు యజమాని షారుఖ్‌ఖాన్‌కు విమానాశ్రయంలో అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో స్టేడియానికి వెళ్లారు. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని పార్థ జిందాల్ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నగరానికి వచ్చారు. షారుక్ స్టేడియంలో మ్యాచ్ జరుగుతున్నప్పుడు తన జట్టు సభ్యులను ఉత్సాహపరుస్తూ కనిపించారు.

గుక్కెడు నీటికి... కడివెడు కష్టం!

... 5వ పేజీ తరువాయి

నిండిపోయి, తాగేందుకు పనికిరాకుండా పోయింది. అయినప్పటికీ సేకరిస్తుండడంతో మరింత బురదమయమయింది. పైగా అన్ని అవసరాలకు అదే నీటిని వినియోగించాల్సి రావడంతో వ్యాధుల బారిన పడుతున్నారు.

అటకెక్కటిన జల్ జీవన్...

గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా తాగునీటి పథకం నిర్మించి, ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని అధికారులు, పాలకులు సుమారు రెండేళ్ల కిందట ప్రకటించారు. దీంతో తమ తాగునీటి కష్టాలు తీరిపోతాయని గ్రామస్థులు భావించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా పథకం నిర్మాణానికి ఒక్క అడుగూ పడలేదు.

ఇందుకోసం తెచ్చిన పైపులు, కాంక్రీట్ వేసేదుకు అవసరమైన కంకర తరలింపు మినహా పనులు చేపట్టలేదు. వేసవి నేపథ్యంలోనూ అధికారులు పథకం ఏర్పాటుకు దృష్టి సారించడం లేదు. కనీసం గ్రామంలో బోరు బావి ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకోవడం లేదని నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని లేదంటే, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.



ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ విశ్వతేజను సంప్రదించగా చీడిపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పైపులైన్ వేసేందుకు రంగం సిద్ధం చేశామని, ఈ నెలాఖరుకల్లా జేజేఎం పనులు పూర్తిచేసి తాగునీటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఎన్నికల ముందే హడావుడి



-బోనంగి నారాయణ, చీడిపల్లి గ్రామస్థుడు

గ్రామానికి తాగునీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రక్షిత నీటి పథకం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు. ఎన్నికల సమయంలో మమ్మల్ని మభ్య పెడుతున్నారు ఆ తరువాత కనీసం పట్టించుకోవడం లేదు. ఈ దఫా తాగునీటి వసతి కల్పనకు కృషి చేసే వారికే ఓట్లు వేస్తాం.

అధికారులూ స్పందించడం లేదు



-వెచ్చంగి బొంతమ్మ, చీడిపల్లి

ఎంతమంది పాలకులు మారినా మా తాగునీటి కష్టాలకు తెర పడడం లేదు. సుదూరం నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి. దీంతో ఇతర పనులకు వెళ్లలేకపోతున్నాం. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే కలుషిత నీటితో రోగాల బారిన పడుతున్నాం.

సంక్షిప్తంగా..

వడ దెబ్బతో తస్మాత్ జాగ్రత్త

- రాజేంద్రపాలెం వైద్యులు సంపత్, మనోజ్ఞ
- నివారణ చర్యలు పాటించడం ఎంతో ఉత్తమం

కొయ్యూరు, ఏప్రిల్ 3: వడ దెబ్బ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యులు సంపత్‌కుమార్, మనోజ్ఞ సూచించారు. వాతావరణ శాఖ సూచన మేరకు మరికొన్ని రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఎండలు అధికంగా ఉన్నందున అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని సూచించారు. తల తిరగడం, నీరసం, తలనొప్పి, వికారంతో పాటు గుండె వేగంగా కొట్టుకోవటం, ఏమి జరుగుతుందో తెలియని స్థితి వంటి లక్షణాలు ఉన్నవారు తక్షణమే వైద్య సేవలు పొందాలన్నారు. పగటి పూట మద్యం తాగి ఎండలోకి వెళ్తే రక్తనాళాలు వ్యాకోచించి చర్మానికి రక్త ప్రసారం పెరుగుతుందన్నారు. దీనివల్ల చెమటలు పడతాయని, పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారుతుందని వారు హెచ్చరించారు.న మజ్జిగ, కొబ్బరినీరు లాంటివి తరచూ తీసుకోవడం, వదులుగా ఉన్న నూలు వస్త్రాలు ధరించడం ఎంతో మంచిదన్నారు. ఎండ నంచి ఇంటికి వచ్చిన వెంటనే చన్నీటి స్నానం చేయకూడదని, పది నిమిషాలు విశ్రాంతి తీసుకున్న తరువాత స్నానం చేయాలని సూచించారు. ప్రధానంగా ఊబకాయం వున్నవారికి వడ దెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు.

విద్యుత్ ఆదా చేయాలని ర్యాలీ

జి.మాడుగుల, ఏప్రిల్ 3: విద్యుత్ ఆదా చేయాలని కోరుతూ విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఎనర్జీ క్లబ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పాఠశాలాల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ ఆదా వల్ల పర్యావరణాన్ని రక్షించవచ్చునని, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణు కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పోషకాహార కిట్లు

సీలేరు, ఏప్రిల్ 3: ధారకొండ పీహెచ్‌సీ పరిధిలో క్షయ బాధితులకు బుధవారం పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. క్షయ రోగులకు నాణ్యమైన పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో కోహెన్స్ లైఫ్ సైన్స్ సీఎస్ఆర్‌లో భాగంగా ఫుడ్ బాస్కెట్లను పంపించినట్టు ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు చెప్పారు. ఈ బాస్కెట్ల ద్వారా ఆయిల్, రాగి పిండి, వేరుశనగ, శనగపప్పు, కందిపప్పు అందించడం జరిగిందన్నారు. క్షయ రోగులు త్వరగా కోలుకోవడానికి ఈ పోషకాహారం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాణి, ఎంపీహెచ్ఈవో పోతురాజు, ఫార్మసిస్టు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

సీలేరు, ఏప్రిల్ 3: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సీలేరు ఎస్ఐ రామకృష్ణ కోరారు. గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని గుమ్మిరేవులు, చెరుకుమళ్ల గ్రామాల గిరిజనులతో బుధవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల ద్వారా పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.

కాలయాపన చేస్తే సహించం: సీఐ

జి.మాడుగుల, ఏప్రిల్ 3: సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి నిర్వహణ విషయంలో వ్యాపారులు కాలయాపన చేస్తే సహించేది లేదని సీఐ రమేశ్ హెచ్చరించారు. బుధవారం వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాపారులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తున్న సీసీ టీవీల వద్ద వీధిలైట్లు తప్పనిసరిగా అమర్చాలని సూచించారు. అవి రాత్రుల్లో నిరంతరం పనిచేసే విధంగా చూసుకోవాలని వ్యాపారులకు ఆదేశించారు. రాత్రి 9 గంటల వరకే వ్యాపార కార్యకలపాలు సాగించాలని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రాంబాబు పాల్గొన్నారు.

రచ్చపల్లిలో కాఫీ తోట దగ్ధం

జి.మాడుగుల, ఏప్రిల్ 3: సింగర్భ పంచాయతీ రచ్చపల్లి గ్రామంలో చెర్రెకి కల్యాణం సాగుచేస్తున్న రెండు ఎకరాల కాఫీతోట బుధవారం దగ్ధమైంది. మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఈ ప్రమాదానికి ఒడిగట్టారని కన్నీరుమున్నీయ్యాడు. ఆర్థికంగా నష్టపోయిన తన కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఓటింగ్ శాతంపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, ఏప్రిల్ 3: గ్రామ స్థాయిలో ఓటింగ్ శాతంపై సెక్టోరల్ అధికారులు అవగాహన కల్పించాలని తహసీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మన భూత్, మన ఓటు కార్యక్రమంలో భాగంగా సెక్టోరల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు ముందుగా పోలింగ్ బూత్ చూపించడంతో పాటు జాబితాలో ఓటును పరిశీలించుకునే అవకాశం కల్పించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు గురికామని, తన ఓటును సక్రమంగా సద్వినియోగం చేసుకుంటానని ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. గ్రామ స్థాయిలో ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ బీఎల్‌వోలు, వీఆర్వోలు దండోరా వేయాలన్నారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఏడు నాటు తుపాకులు సరండర్

చింతపల్లి, ఏప్రిల్ 3: మండలంలోని అన్నవరం పోలీసు స్టేషన్ పరిధిలోని గిరిజనులు స్వచ్ఛందంగా ఏడు నాటు తుపాకులను అప్పగించారని ఎస్ఐ రాజారావు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని ఏడుగురు గిరిజనులు వినియోగిస్తున్న నాటు తుపాకులను స్వచ్ఛందంగా సరెండర్ చేశారన్నారు. ఇప్పటికి ఆదివాసీల వద్ద నాటు తుపాకులు ఉంటే వెంటనే స్టేషన్‌లో అప్పగించాలన్నారు. పోలీసు సోదాల్లో గిరిజనుల వద్ద నాటు తుపాకులు పట్టుబడితే కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసుల్లో నిందితులకు పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ఆదివాసీలు వద్ద నాటు తుపాకులు ఉంటే వెంటనే స్టేషన్‌కి తీసుకొచ్చి అప్పగించాలని ఆయన కోరారు. ఇప్పటి వరకు 17 నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నామన్నారు.